
# బంగారు విగ్రహాలు

— యస్. గోవిందరాజులు



'తాతల నాడు నేతులు తాగారు- యిప్పుడు మా మూతులు వాసన చూడండి' అన్న సామెతలా గతవైభవానికి చిహ్నంలా రాజరత్నంగారికి మిగిలింది ముత్తాత చేయించిన బంగారు దేవుని విగ్రహాలు 'వాటి విలువ ఖర్చు చేస్తే లక్షలు వుంటుంది. కాని కేవలం పూజకి మాత్రమే పనికి వస్తున్నవి కాబట్టి వాటి విలువ పూజ్యం'



అంటుంది రాజరత్నంగారి భార్య అరుంధతమ్మ.

రాజరత్నం గారి తాతల కాలం నుండి వైభవంగా ఆ విగ్రహాలతో ఉత్సవాలు జరిపించారు. ముత్తాత కాలం నుండి ఆ వైభవం ప్రారంభమై తండ్రి కాలం వచ్చేసరికి క్షీణించి, రాజరత్నంగారి హయాంలో శూన్యం అయింది. ఊరంతా పిలిచి ఉత్సవం చేయించక పోయినా, ఆ సివాయితీ మానలేక సీతారామ కల్యాణం ఇంటిలోనే తంటాలు పడి చేసేవారు.

ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని

అమ్ముకునే స్థితికి దిగజారలేదు.

పేరుతో పెద్దకూతురి పెండ్లి, పరపతితో రెండో కూతురి పెండ్లి, విగ్రహాల బడాయితో మూడో కూతురి పెండ్లి చేయ గలిగారు గాని, నాలుగో కూతురు—కడగొట్టు కూతురు పెండ్లి ఏ విధంగానూ కలిసి రాలేదు.

ఇంతవరకూ బాగానే వున్నది గాని, కూతురు పెండ్లి కాక పోవ డంతో భార్యా భర్తలకి రోజూ ఆ విగ్రహాల గూర్చి తగువు రావడం ప్రారంభమైంది.

"అవి మా తాతల కాలానివి. మా వంశం వుండే వరకూ అవి వుండాలిసిందే: వాటిని కదిలించే అపచారం నే చేయను" అని ఆయన అనేవారు.

ఆ విగ్రహాలని అందరికీ చూపి ఎన్నో గొప్పలు చెప్పుకొంది అరుంధతమ్మ. కాని యీ రోజు కూతురు వయస్సు ముప్పై ఏకి వచ్చే స్తోంది. గతించిపోయిన గొప్ప కన్నా కూతురుకి పెండ్లే ముఖ్యం అన్నది ఆమె స్త్రీ హృదయానికి తెలిసి. వాటిని అమ్మమని ఒకటే గొడవ.

పిల్లీ పిల్లీ పోరులో కోతి లాభం పొందినట్లు, వారిద్దరి తగూ యిలా తెగకుండా వుండగానే ఆ విగ్రహాలని కాస్త దొంగలు దోచుకున్నారు.

"రెంటికిచెడ్డ రేవడిఅయ్యారు" అని ఆవిడ సాధించి మంచం ఎక్కింది.

అటు కూతురు పెండ్లి కాలేదు- గొప్పకి చిహ్నంగా నిలిచిన సొమ్మూ పోయింది.

ఆవిడ దుఃఖం చెప్పనలవి గాకుండా వుంది.

రాజరత్నంగారు దుఃఖాన్ని దాచుకొని పోలీస్ స్టేషన్‌కి పరిగెట్టి ఇనస్పెక్టర్‌గారితో సవినయంగా, దీనంగా, బాధగా విన్నవించు కున్నారు.

అంతా విని ఇనస్పెక్టర్‌గారు ధైర్యం చెప్పి, బుజ్జగించి యింటికి పంపారు.

ఆ రోజు సాయంకాలం వెళ్ళారు. మరునటి రోజు ప్రొద్దుటే వెళ్తే స్టేషన్ బయట కూర్చున్న యిద్దరు కానిస్టేబుళ్ళు లేచి రాజ రత్నంగారికి నమస్కారాలు చేసి- "సార్! విగ్రహాలు దొరికాయి. తరువాత మమ్మల్ని బాగా సంతోష పెట్టాలి" అని అన్నారు.

రాజరత్నంగారు వుప్పొంగి పోయారు.

వేగంగా లోనికివెళ్ళి-"సార్! మా విగ్రహాలు దొరికాయటగా!"

అని వుత్సాహంగా అడిగారు.

ఆ ప్రశ్నకి ఇనస్పెక్టర్ పైకి తేలకుండా వులిక్కిపడి—"మీ కెవరు చెప్పారు?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"మన కానిస్టేబుల్స్" సంతోషంగా అన్నాడు. ఆయన మొఖం దివిటీలా వెలిగి పోతున్నది.

విగ్రహాలకి ఎలానూ స్థానచలనం వచ్చింది గానట్టి, ఆ బంగారాన్ని కరిగించి అమ్మి పిల్లకి పెండ్లి చేసి కొడుకులకి ఓ మంచి దారి చూపిద్దామని లోలోన క్రొత్త ఆలోచన! దాని సంబంధమైన సంతోషం మరి!

"తొత్తు లంజకొడుకులు. ఇదిగో తోక అంటే అదిగో పులి అంటారు. ఆచూకీ తెలిపింది. విగ్రహాలు యింకా మా చేతికి రాలేదు. ఇంకా పదిరోజులు పోయిన తరువాత కనపడండి. రోజూ రానవసరంలేదు తప్పక మీ విగ్రహాలు దొరుకుతాయి. ఇది నా హామీ" అన్నారు ఇనస్పెక్టర్ గారు.

'హతోస్మి!' అని బయట కొచ్చారు. మాట చెప్పిన కానిస్టేబుల్స్ అక్కడ లేరు.

* * *

అసలు విగ్రహాలు దొరికిన మాట వాస్తవమే! అంతంత పెద్ద బంగారు విగ్రహాలవి. అంత బంగారాన్ని ఒక్కసారే చూసేసరికి ఇనస్పెక్టర్‌గారి కళ్ళు చెదిరి బుర్ర చురుకుగా పనిచేసింది మరి!

అలవాటు అయిన దారి వుంది.

పది రోజుల తరువాత రాజరత్నంగారికి కబురు వెళ్ళింది విగ్రహాలు దొరికాయని.

అడుగంటిన ఆశలు తిరిగి చిగురించాయి.

ఆఘ మేఘాలమీద పోలీస్ స్టేషన్‌కి వెళ్ళారు. టేబుల్ మీద తళతళలాడిపోతూ విగ్రహాలు.

రాజరత్నంగారి మొఖం ట్యూబ్ లైటులా వెలిగింది.

ఆతృతగా చేతిలోకి రాముల వారిని అందుకొన్నారు. రాముల వారి విగ్రహం నిండుగా, బరువుగా వుండేది. బరువు తగ్గినట్లుగా, చిక్కినట్లుగా అనిపించింది రాజరత్నంగారికి. 'పుట్టి కళ్ళు విప్పిన దగ్గరనుండి చూపిన రాములవారు ఈనాడు చిక్కారా? అది నా భ్రమ' అని అనుకొని, "వీటి బరువుని తూకం వేయకపోయినా బిడ్డ బరువు తల్లికి తెలిపినట్లు నాకు తెలుసు. బరువు తక్కువగా ఉన్నాయి సార్!" అన్నాడు భయంగా ఇనస్పెక్టర్‌గారితో.

"అవి మీవేనా?" గాంభీర్యంగా అన్నారు ఇనస్పెక్టర్‌గారు.

"మాకు కావలసినది అంతే! మీవి బంగారు విగ్రహాలుపోయాయి. మాకు దొరికినవి ఇవి ఇవి మీవా కావా అన్నది మాకు కావాలి!" అన్నాడు.

'ఏమంటే ఏం చిక్కు వస్తుందో? అసలుపోయాయి అనుకున్నవి దొరికాయి. నాదే దృష్టి దోషం' అనుకొని 'నావే' అన్నారు.

అప్పటికి అవి చేతికి రాలేదు.

"ఇవి మీకు కోర్టు ద్వారా ముడతాయి" అన్నారు.

'ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాల చచ్చినట్లు, ఈ వయసులో కోర్టుకి వెళ్ళాలా? కోర్టు ఎక్కినవాడు గాడిద ఎక్కినట్లే అంటారు పెద్దవారు' అని చాలా విచారించారు.

అక్కడినుండి ప్రారంభమైంది కథ.

చెప్పులు అరిగేటట్లు కోర్టు చుట్టూ తిరగడం....సాయంకాలం వరకూ కుక్క కాపలాగా వరండాలో పడి వుంటే సాయంకాలానికి 'వాయిదా వేశాం' అని చావు కబురు చల్లగా చెప్పేవారు.

కదిలితే డబ్బు, మెదిలితే డబ్బు కావాలంటారు. 'మీ విగ్రహాలు తొందరగా మీ చేతికి రావాలంటే ఖర్చుపెట్టక తప్పద'న్నారు కోర్టు విజ్ఞులు. అప్పో సప్పో చేసి ఖర్చు చేశారు.

రెండు నెలలు కాళ్ళకి బలపాలు కట్టుకుని తిరిగాక, చేతి చిద్దు చాలా వదిలిన తర్వాత 'ఇవిగో మీ బంగారు విగ్రహాలు' అన్నారు కోర్టువారు.

తిండీ తిప్పలూ లేకపోతే జైల్లో వుండే మనుష్యులు చిక్కిపోవడం అన్నది సహజం.

కానీ....

పూజా పునస్కారాలు లేకపోతే దేవతా విగ్రహాలు కూడా రూపు పోగొట్టుకుంటాయా?

రాజరత్నంగారికి అర్థం కాలేదు.

వాటిని చూడగానే చిక్కిపోయిన బిడ్డను చూసి తల్లి విలవిల్లాడినట్లు విల విల్లాడిపోయారు.

పేరుకి అవి బంగారు విగ్రహాలే!

కానీ తన ముత్తాత చేయించిన కిలోల బరువు కలిగినవి కావు.

వాటిలో ఆ విగ్రహాలలోని కళ లేదు.

రెండు చేతులతో మోయలేనంత బరువు వున్నట్లు వుండేవి.

ఇవి దూది బొమ్మలంత తేలిగ్గా వున్నాయి.

నావి కావంటే ఇనస్పెక్టర్ చెప్పిన సమాధానమే వీళ్ళూ చెప్తారని-యీ రెండు నెలల అను భవంలో రాజరత్నంగారు తెలుసు కొన్నారు.

'విగ్రహాలు పోయాయి' అన గానే తన భార్య ఘొల్లున ఎందుకు ఏడ్చిందో, యిప్పటికీ మంచం మీద బెంగపెట్టుకుని ఎందుకు వున్నదో—ఆ క్షణాన రాజరత్నం గారికి తెలిసి వచ్చింది.

ఆ విగ్రహాలని చూడగానే సంతోషానికి బదులు ఘొల్లున వేదన తీరేటట్లు ఏడవాలని ఆయనకి అనిపిస్తోంది.

తాతలకాలం నాటి వైభవ చిహ్నం అయిన బంగారు విగ్ర హాలూ దక్కలేదు-కూతురు పెండ్లీ కాలేదు.

చేతుల్లో వాటిని పెట్టుకొని ఆయన వరండాలోకి వచ్చారు.

వర్షించడానికి సిద్ధంగా వున్న మేఘాల్లా వున్నాయి ఆయన కనులు.

కళ్ళల్లో నీరు తన ప్రమేయం లేకుండా వూరుతోంది.

"ఏమండీ! బాధ పడకండి. ఇవైనా దక్కినందుకు సంతోష పడండి!" ఓ వ్యక్తి చేతిలో ఓ సొట్టలు పడ్డ కాగుని పట్టుకొని రాజరత్నంగారిని ఓదార్చారు.

"మీరెవరూ?" దుఃఖాన్ని అణచుకొంటూ అడిగారు.

"నేనూ మీ వంటి వాడినే. మా అమ్మల కాలం నాటి పెద్ద చాకలి బాన వంటి రాగి కాగుని, వేసవికాలం నీళ్ళకి తొందరగా వుందని అటక మీద నుండి దించి వాడుతూ వుంటే, దొంగలు ఎత్తుకు పోయారు.

"ఆ కాగు ఇప్పుడు ఇనస్పెక్టర్ గారి బాత్ రూములో వుంది. ఆయన యింటిలోవిది కోర్టు హెడ్ గుమాస్తాగారి యింటిలో వుంది. హెడ్ గుమాస్తాగారిది ప్రాపర్టీ యిన్‌ఛార్జి క్లర్కుగారి యింటిలో వుంది. వారి యింటిలోవి చిల్లులు సొట్టలు పడ్డవి నా చేతిలో వుంది" అంటూ ఎత్తి చూపించాడు ఆ వ్యక్తి.

"మరి మీరు యిది నాది కాదన లేదా?"

"కంచే చేను మేస్తే చేసేది ఏముంది? రక్షించే వారే భక్షిస్తే మన గోడు ఎవరికి చెప్పుకొంటాం? అంతా చెవిటి వాడి ముందు శంఖం వూదినట్లే కదా! ఏదో దక్కిందే చాలు-అవి తీసుకొన్నా" అని ఏడవ లేక నవ్వాడు అతను.

రాజరత్నంగారూ—ఏడవలేక, నవ్వలేక దక్కిన విగ్రహాలని తీసు కొని యింటి దారి పట్టారు. ●